www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -261 గురువారం 5 డిసెంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Disirrcts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

## ఎపి, తెలంగాణ లో భూ ప్రకంపనలు



### రిక్టర్ స్కేల్ పై 5.3 గా తీవ్రత నమోదు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాలను భూ ప్రకంపనలు వణికించాయి. బుధవారం ఉదయం 7 గంటల నుంచి 7.28వరకు పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. బుధవారం ఉదయం 7:27 గంటలకు తెలంగాణ లోని ములుగు కేంద్రంగా రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ప్రకటించింది. ములుగు జిల్లాలో మేడారం, మారేడుపాక, బోర్ల గూడెం మధ్య ఉన్న ప్రాంతంలో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూమిలోపల 40 కి.మీ లోతున భూ కంపం వచ్చినట్టు గుర్తించారు.

మిగతా 2లో

## ఉద్యోగాల ఊసే లేకుండా

# గత పదేళ్ల పాలన...!

- ఉద్యోగ, ఉపాధి కల్పనే నా ధ్యేయం
- తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నా ధ్యేయం
- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు
- యువకులను రెచ్చగొట్టేలా బీఆర్ఎస్ వ్యవహరిస్తుంది
- రాష్ట్రాన్నినిరుద్యోగులు పోరాటం చేసి సాధించుకున్నారు
- వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు
- ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 54 వేలకు పైగా ఉద్యోగాలు
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం
- యువకుల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించే చర్యలకు శ్రీకారం
- యువ వికాసం సభా వేదికపై సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



పెద్దపల్లి, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత తమకే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో బుధవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా యువ వికాసం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రత్యేక స్టాల్స్ ను సభ వద్ద ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ లో ఆపరేషన్ గరుడ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, డీ.ఈ.ఈ.టి, ఏ.ఎల్.ఈ.ఏ.పి, టాస్క్, ఎన్.ఎస్.ఐ.సి, న్యాక్, టామ్ కామ్, యువజన క్రీడ శాఖ, సింగరేణి సంస్థ ద్వారా కూడా స్టాల్ ఏర్పాటు చేయగా, ముఖ్య మంత్రి పరిశీలించారు. అలాగే రూ. 1024 కోట్ల 90 లక్షలతో

## పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా

### సాంకేతిక లోపం తలెత్తడంతో నిర్ణయం



2లో

## ముఖ్యమంత్రి అబద్దాలు చెప్పడంలో రాటుదేలారు

- ప్రభుత్వం ప్రతి నెలా రూ.6500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నారన్నది పచ్చి అబద్ధం
- కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై త్వరలో రాహుల్ గాంధికి లేఖ రాస్తా
- నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి సరైన స్థానంలో ఉంటుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజావినికిడి,:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 7లక్షల కోట్లు అప్పు అని దుష్ప్రచారం చేస్తున్నారని, అబద్ధాలు చెప్పడంలో సీఎం రాటుదేలి పోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆయన నోటివెంట ఎప్పుడూ అబద్ధాలే వస్తున్నాయని ఆరోపించారు. మిగతాది 2లో...

## వీడిన సస్పెన్స్

### మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్



ముంబై, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: గత 11 రోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. మహారాష్ట్ర నూతన సీఎంగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం మహాయుతి కూటమి నేతలు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలవనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ గవర్నర్‌ను కలిసి తమ అభ్యర్థనను వినిపించనున్నారు. ప్రభుత్వ ఏర్పాటు విషయంపై గవర్నర్‌కు వివరించనున్నారు. బుధవారం ఉదయం జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో.. సీఎంగా ఫడ్నవీస్ పేరును ప్రతిపాదించగా.. ఏకగ్రీవంగా ఆమోదించారు. రేపు (డిసెంబర్ 5న) ముంబై ఆజాద్ మైదాన్‌లో ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. మిగతాది 2లో...

## పంజాగుట్టలో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని హైకోర్టులో హరీశ్ రావు పిటిషన్

**ఫోన్లు ట్యాప్ చేశారని హరీశ్ రావుపై కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదు**

**ప్రణీత్ రావు సాయంతో కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేశారన్న కాంగ్రెస్ నేత**

**హరీశ్ రావుతో పాటు రాధాకిషన్ రావుపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు**




హైదరాబాద్
డిసెంబర్ 4 ప్రజావినికిడి,:
హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని అందులో పేర్కొన్నారు.చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో హరీశ్ రావుతో పాటు రిటైర్డ్ పోలీస్ అధికారి రాధాకిషన్ రావుపై పంజాగుట్ట పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసును నమోదు చేశారు. హరీశ్ రావుపై చక్రధర్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేశారు. ఎన్నికల సమయంలో తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యులకు చెందిన ఇరవై ఫోన్లను ప్రణీత్ రావు సాయంతో ట్యాప్ చేశారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. ఈ క్రమంలో పంజాగుట్టలో ఎఫ్ఐఆర్ నమోదైంది.



## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

- ఏషియా పసిఫిక్ జోన్లో రెండో సెంటర్
- తెలంగాణలో పెట్టుబడులకు కుదిరిన ఒప్పందం
- గూగుల్‌తో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఒప్పందం
- సీఎం రేవంత్ నివాసంలో కంపెనీ ప్రతినిధి బృందం భేటీ
- ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ హైదరాబాద్ మేటి
- ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధికి కేంద్రంగా హైదరాబాద్
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి



## గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం పటిష్టం

### : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కఠినంగా ఉందని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 2023 మేలో గూండా చట్టం కింద పెండింగ్‌లో ఉన్న విచారణలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. మిగతాది 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# ఉద్యోగాల ఊసే లేకుండా గత పదేళ్ల కాలంలో పాలన

(మొదటి పేజీ తరువాయి)
పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఎందరో నిరుద్యోగులు పోరాటం చేసి సాధించుకున్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అవకాశాలను నిరుద్యోగులకు చేరువ చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 54 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామని, అలాగే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువకుల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించే చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో, ఉద్యోగాల ఊసే లేకుండా పరిపాలించిందని, తాము ఉద్యోగాలు ఇస్తుంటే యువకులను రెచ్చగొట్టేలా బీఆర్ఎస్ వ్యవహరించిందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి తన ధ్యేయమని, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో తమ ప్రభుత్వంపై ఎన్నో దుష్ప్రచారాలు సాగిస్తున్నారని, తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం వాటికి సమాధానమన్నారు. ఈ కార్యక్రమంలోనే గ్రూప్-4 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు యువ వికాసం సభా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ పాలనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పదేళ్ల పాలనను.. ఏడాది పాలనను పోల్చి చూడాలని విజ్ఞప్తి చేస్తున్నామని సీఎం రేవంత్ కోరారు. ప్రతిపక్షాల చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వడ్లు పండిస్తున్న జిల్లా పెద్దపల్లి అని?



అన్నారు. ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మోదీ సీఎం, పీఎంగా ఉంటూ గుజరాత్‌లో ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నియామక పత్రాలు ఇచ్చామని అన్నారు. ఉద్యోగాలపై మాట్లాడాలని మోదీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. వడ్లు పండించమని చెప్పామని, అందుకే మద్దతు ధర, బోనస్ ఇస్తున్నామని చెప్పారు. చాలా ఏళ్ల తర్వాత ఆడబిడ్డల కళ్లలో సంతోషం చూశానని సీఎం రేవంత్?రెడ్డి వ్యాఖ్యానించారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలు ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాతవాహన వర్సిటీకి ఇంజినీరింగ్, లా కాలేజీలు మంజూరు చేస్తామని ప్రకటించారు. సీఎం వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటి పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ లు ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు రాష్ట్ర స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపి, తెలంగాణ లో భూ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)
చర్ల, దుమ్ముగూడెం ప్రాంతంలో ప్రకంపనలు అధికంగా కనిపించాయి. ఇళ్లంతా కదిలిపోతున్నట్టు అనిపిండచంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసినట్టు స్థానికులు తెలిపారు. కళ్లు తిరుగుతున్నట్లు అనిపించడం, ఇళ్లలో సామాన్లు పడిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో కూడా భూ ప్రకంపనలు వచ్చిన వార్తలు వెలువడ్డాయి.

ఖమ్మం-ఏలూరు జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాల్లో ఈ భూ ప్రకంపనలు అధికంగా కనిపించాయి. ఖమ్మం జిల్లా చర్ల, మణుగూరు ప్రాంతాల్లో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్‌లో కూడా పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు కనిపించాయి. ఉదయం ఇళ్లలో ఉన్న ఉన్నవారు వీటిని గుర్తించగలిగినట్టు తెలుస్తోంది.బుధవారం ఉదయం వచ్చిన భూ ప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. తెలంగాణలో హైదరాబాద్, హనుమకొండ, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మలోని చర్ల, మణుగూరు సహా పలు ప్రాంతాల్లో పలు చోట్ల భూమి స్వల్పంగా కంపించింది.ఏపీలో జగ్గయ్యపేట, తిరువూరు, గంపలగూడెం పరిసర గ్రామాల్లో పలు సెకన్ల పాటు భూమి కంపించింది.తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాలు భూకంపాలు సంభవించే జోన్‌లో ఉన్నాయి. నదీ తీర ప్రాంతాలు, బొగ్గు గనులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తరచూ భూ ప్రకంపనలు నమోదవుతుంటాయి.భూమి పొరల్లో జరిగే సర్దుబాట్ల వల్ల కూడా అప్పుడప్పుడు ప్రకంపనలు నమోదవుతుంటాయి. బుధవారం సాధారణం కంటే ఎక్కువగా ఈ ప్రకంపనలు నమోదు కావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.ఎన్టీఆర్ జిల్లాలో..తెలుగు రాష్ట్రాల్లో భూకంపం ప్రకంపనలు సృష్టించింది. విజయవాడలో కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీశారు. జగ్గయ్యపేట పరిసర గ్రామాల్లో సైతం భూమి కంపించింది. విజయవాడలో కూడా కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి ప్రజలు ప్రాణ భయంతో బయటకు పరుగులు పెట్టారు.

భద్రాద్రి కొత్తగూడెంలోభద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోనూ మూడు సెకన్లపాటు భూమి కంపించింది. బుధవారం ఉదయం 7:27 గంటలకు ఒక్కసారిగా భూకంపం రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అలాగే మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఐదు సెకన్లపాటు భూమి కంపించింది. ఉదయం 7:28 నిమిషాలకు భూ ప్రకంపనలు వచ్చాయి..మహబూబాబాద్ జిల్లా గంగారంలో భూమి తీవ్రంగా కంపించింది. భూకంపం దెబ్బకు కుర్చీలో కూర్చున ప్రజలు సైతం కిందపడిపోయారు. దీంతో అంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కరీంనగర్ విద్యానగర్‌లోనూ భూమి కంపించింది. నిలబడిన వారు సైతం ఒక్కసారిగా పక్కకు ఒరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని, సుల్తానాబాద్, కరీంనగర్, హుజురాబాద్‌లో సైతం స్వల్పంగా భూకంపం వచ్చింది.పెద్దపల్లి జిల్లాలో%౫%పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో భూకంపం ప్రభావం కనిపించింది. హనుమకొండ హంటర్ రోడ్ లోని దీన్ దయాల్ నగర్, విద్యుత్ నగర్ లోని స్థానిక ప్రజలు భయంతో ఇంటి నుంచి బయటకు పరుగులు తీసారు. వంట గదిలోని గిన్నెలు కింద పడ్డాయి

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

హైదరాబాద్ డిసెంబర్ 4 ప్రజావినికిడి,:
తెలంగాణ ప్రభుత్వం దిగ్గజ సంస్థ గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్ ముందుకొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ని హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో స్థాపించే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే అయిదవది కాగా, ఏషియా పసిఫిక్ జోన్లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ కావడం విశేషం గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ అనేది ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్ . ఈ సేఫ్టీ సెంటర్ అధునాతన భద్రతతో పాటు ఆన్‌లైన్ సేఫ్టీ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, రీసెర్చర్లకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా మారనుంది. భారతదేశంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో ఈ సేఫ్టీ సెంటర్ పని చేస్తుంది. ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ సంస్థ అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్ లో నిర్మిస్తోందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ 3న జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. అప్పటి నుంచి జీఎస్ఈసీని తమ రాష్ట్రంలోనే నెలకొల్పాలని, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు దేశంలోని పలు రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



అమెరికా పర్యటనలో భాగంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. దాంతో హైదరాబాద్‌లో ఈ అత్యాధునిక సెంటర్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. ఈ సేఫ్టీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గూగుల్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్య ఒప్పందం చేసుకోవటంతో హైదరాబాద్ మరోసారి ప్రపంచంలో మేటీ ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ అధ్వర్యంలోని కంపెనీ ప్రతినిధి బృందం బుధవారం జూబ్లీహిల్స్ లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని ఈ సందర్భంగా హాన్సెన్ అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో అయిదు ఫేమస్ టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంత పరిష్కరించే వీలుంటుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని' చెప్పారు. హైదరాబాద్ లో భారతదేశంలోనే మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను స్థాపించేందుకు సీఎం రేవంత్ రెడ్డిని గూగుల్ సీఐఓ కలిశారు. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేసే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ హైదరాబాద్ లో స్థాపించడం గమనార్హం. ఈ సెంటర్ అధునాతన భద్రత, ఆన్లైన్ భద్రత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవల యూఎస్ఏ లోని గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన సందర్భంగా అక్కడ గూగుల్ సమస్త ప్రతినిధులతో పలు అంశాలను సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. హైదరాబాద్ నగరంలో జీఎస్ఈసిని ఏర్పాటు చేసేందుకు, గూగుల్ ముందుకు రావడం తనకు గర్వంగా ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. గూగుల్ తో జరిగిన ఒప్పందంతో డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు అవకాశం ఉంటుందని, సైబర్ సెక్యూరిటీ కార్యక్రమాలలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన అయిదు టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంత పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు.

# పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా

## సాంకేతిక లోపం తలెత్తడంతో నిర్ణయం

శ్రీహరికోట, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా పడింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇవాళ నింగికి ఎగరాల్సిన ప్రోబా3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 నిమిషాలకు ప్రయోగం ఉంటుందని ఇస్రో చెప్పింది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిలైట్లను ఇస్రో నింగిలోకి పంపుతున్నది. నిజానికి ఇవాళ సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్‌వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.

# గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం పటిష్టం : సుప్రీం కోర్టు

(మొదటి పేజీ తరువాయి)ఈ పిటిషన్ గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వ స్పందన కోరింది. దీంతో గ్యాంగ్‌స్టర్ చట్టం కింద పిటిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు స్టే విధించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపున న్యాయవాదులు గౌరవ్ అగర్వాల్, తన్వి దూబె వాదనలు వినిపించారు. యూపీ గ్యాంగ్‌స్టర్ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎఫ్ఐఆర్ నిరాధారమని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ ఆరోపించారు. పిటిషనర్‌పై గ్యాంగ్‌స్టర్ల చట్టాన్ని వర్తింపజేయడం పక్షపాతంతో కూడుకున్నదని, ఇది పోలీసు, న్యాయ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. బుధవారం పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తొలుత 1986 చట్టంలోని సెక్షన్ల కింద అక్రమ మైనింగ్ కేసు నమోదు చేశారని.. ఒకే అభియోగంపై రెండుసార్లు కేసు నమోదైందన్నారు. గూండా చట్టాన్ని విమర్శించిన ధర్మాసనం దాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా కోర్టు విచారిస్తుందని ధర్మాసనం తెలిపింది. అంతకుముందు హైకోర్టులో పిటిషనర్ తరఫు న్యాయవాది గ్యాంగ్‌స్టర్ చట్టం కింద నమోదైన కేసులో తనను ఇరికించారని వాదనలు వినిపించారు. పిటిషనర్ పేరు లేని మరో కేసు ఆధారంగానే గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు
.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్

(మొదటి పేజీ తరువాయి)
సీఎంతోపాటు ఇద్దరు ఉపముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని స్పష్టం చేశాయి. అజిత్ పవార్‌తోపాటు ఏక్‌నాథ్ షిండే డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. షిండేకు మరిన్ని కీలక పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇక ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్పడంలో రాటుదేలారు

(మొదటి పేజీ తరువాయి)
ప్రభుత్వం కొలువుతీరి ఏడాది పూర్తయినా ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. అబద్ధాలతో సీఎం తన మంత్రివర్గ సహచరులను, ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అప్పులకు తన ప్రభుత్వం ప్రతి నెల రూ.6500 కోట్ల వడ్డీ చెల్లిస్తోందని సీఎం చెబుతున్నారని, అది కూడా పచ్చి అబద్ధమని అన్నారు.
తెలంగాణ అప్పులకు ప్రభుత్వం చెల్లిస్తోన్న వడ్డీ రూ.2900 కోట్లు మాత్రమేనని ఆర్బీఐ డాక్యుమెంట్‌లు స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ నుంచి అక్టోబర్ చివరి వరకు ప్రభుత్వం వడ్డీల రూపంలో కేవలం రూ.2164 కోట్లు మాత్రమే చెల్లించినట్లు కాగ్ నివేదిక స్పష్టం చేస్తోందని కేటీఆర్ అన్నారు. కాబట్టి ముఖ్యమంత్రి ముందుగా తన ప్రవర్తనను మార్చుకుని, తెలంగాణ ప్రజలను అయోమయానికి గురిచేయడం మానుకోవాలని సూచించారు. హరీష్‌రావుపై తప్పుడు కేసు పెట్టారని, అలాంటి కేసులకు తాము భయపడబోమని అన్నారు.రాహుల్ గాంధీకి లేఖ రాయబోతున్నా : తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌గా మారిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అప్పుల గురించి కాదు..హామీల గురించి మాట్లాడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నిత్యం అప్పులు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. ఏడాది పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై త్వరలో రాహుల్ గాంధీ కి లేఖ రాస్తానని ప్రకటించారు. రేవంత్ రెడ్డి బండారం మొత్తం బయటపెడతానని కీలక వ్యాఖ్యలు చేశారు. దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఎవరూ సంతోషంగా లేరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు ఇద్దరు తప్ప ఎవరూ బాగుపడలేదని వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణ రైజింగ్ కాదు..రేవంత్ బ్రదర్ రైజింగ్ అని అన్నారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ ఉంటే చూపించాలని, నిరూపిస్తే అది రేవంత్ కే రాసిస్తానని కీలక ప్రకటన చేశారు.నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి సరైన స్థానంలో ఉంటుంది : రేవంత్ రెడ్డీ..నువ్వెన్ని కథలు పడ్డా నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి సరైన స్థానంలో ఉంటుందని కేటీఆర్ అన్నారు. రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఎక్కడైతే పెట్టారో అక్కడ తెలంగాణ తల్లి కచ్చితంగా నిటారుగా నిలబడుతుందన్నారు. మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారన్నారు. కానీ కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భారతమాత రూపాన్ని వాజ్ పేయి అధికారంలోకి వచ్చాక మార్చలేదన్నారు.దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిపినప్పటికీ ఆయా రాష్ట్రాల విగ్రహాల రూపును మార్చలేదన్నారు. తెలంగాణ తల్లి రూపును మాపే ప్రయత్నం ఇకనైనా మానుకోవాలన్నారు. అధికారం ఉందని పోలీసు బలగాల మధ్య మీ నాటకాలు కొంతకాలం మాత్రమే సాగుతాయని, కానీ ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. అంబేద్కర్ సచివాలయం గురించి, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ గురించి మాత్రం మాట్లాడటం లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని 2007 ఉద్యమ కాలంలో రూపొందించినట్లు చెప్పారు.

# వచ్చే ఏడాది నుంచి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:



ప్రతి ఏడాది దీక్షా దివస్ సందర్భంగా నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు విస్తృతంగా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ లిటరేచర్ ఫెస్టివల్‌ను హైదరాబాద్ సహా పాత జిల్లాల కేంద్రంగా నిర్వహిస్తాం. సాహిత్య కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు చేసుకుందామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సంస్కృతి, భాషపరంగా తెలంగాణ ఔన్నత్యాన్ని చెప్పుకునే విషయంలో కొంతమేర సఫలం అయ్యాం. బతుకమ్మ, బోనాల పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా జరుపుకున్నాం. తెలంగాణ చరిత్రను, ఉద్యమకారులను సిలబస్‌లో పెట్టుకున్నాం. అదే మాదిరిగా యూనివర్సిటీలకు గొప్ప నాయకులు పేర్లు పెట్టుకున్నాం. పీవీ నరసింహారావు, ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ నారాయణరావు, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి గొప్ప మేధావుల పేర్లు పెట్టుకున్నాం. కొత్త జిల్లాలకు కూడా ఉద్యమకారుల పేర్లు పెట్టుకున్నాం.. అలా తెలంగాణ చరిత్రను వెలుగెత్తే చాటే ప్రయత్నం చేశామని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలు కేసీఆర్ నాయకత్వంలో మూడు రోజులు ఘనంగా నిర్వహించాం. రచయితలు, కవులను ఘనంగా సన్మానించుకున్నాం. సాంస్కృతిక సారథి పెట్టి రసమయి బాలకిషన్‌ను చైర్మన్‌గా నియమించి, 500 మంది కళాకారులకు ప్రభుత్వ కొలువులు ఇచ్చాం. ప్రాజెక్టులు కట్టుకుంటే.. ఆయా ప్రాంతంలో ఉండే దేవుళ్ల పేర్లు పెట్టుకున్నాం. కానీ మన పార్టీ నాయకుల పేర్లు పెట్టుకునే ప్రయత్నాలు జరగలేదు. మన డబ్బా మనమే కొట్టుకునే ప్రయత్నం జరగలేదు. ప్రాంతం శాశ్వతం.. అధికారం శాశ్వతం కాదు. తెలంగాణ శాశ్వతం కాబట్టి తెలంగాణ చరిత్ర శాశ్వతంగా గొప్పగా నిలవాలని ఈ ప్రయత్నం చేశాం. కేసీఆర్ పేర్ల మీద ఎలాంటి కార్యక్రమాలు చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కాళోజీ కళాక్షేత్రం వరంగల్‌లో కట్టినా.. ఇతర జిల్లాల్లో కాళోజీ కళాభారతి పేరిట నిర్మించాం. సాహితీవేత్తలకు, రచయితలకు పెద్దపీట వేశారు కేసీఆర్. గ్రంథాలయాలు కొత్తవి ఎన్నో ప్రారంభించుకున్నాం. ఇంకా జరగాలి అని తెలంగాణ సమాజం కోరుకుంటుంది అని కేటీఆర్ తెలిపారు.

## చెక్‌పోస్టులలో ఏసీబీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: రాష్ట్రంలోని పలు చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు చెక్‌పోస్టుల్లో 7 ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. లెక్కలు చూపని నగదును ఏసీబీ బృందాలు సీజ్ చేశాయి. విష్ణుపురం చెక్‌పోస్టులో రూ. 86,500, భోరజ్(ఆదిలాబాద్) చెక్‌పోస్టులో రూ. 62,500, అలంపూర్ చెక్‌పోస్టులో రూ. 29,200 సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

..........................................................................

# మేడారంలో ప్రకృతి ప్రకోపం

## లక్ష చెట్లు విరిగినా..95 రోజుల్లో భూకంపం



హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: పచ్చని తాడ్వాయిపై ప్రకృతి కన్నెర్ర చేసినట్లు ఉంది. సుమారు లక్ష చెట్లు కూలిన .. 95 రోజుల్లోనే.. ఆ ప్రాంతం మళ్లీ ప్రకృతి ప్రకోపానికి గురైంది. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీన వచ్చిన వర్షం, ఈదురుగాలులతో.. మేడారం అడవుల్లో సుమారు 85 వేల చెట్లు కూలాయి. దాంట్లో భారీ వృక్షాలు ఉన్నాయి. సుమారు 50 నుంచి వంద ఏండ్ల నాటి మహావృక్షాలు కూడా ఆ నాటి ప్రకృతి ప్రకోపానికి నేలరాలాయి. అయితే ఇవాళ ఆ ప్రాంతమే కేంద్రంగా భూకంపం సంభవించింది. ములుగు జిల్లాలోని మేడారం కేంద్రంగా 5.3 తీవ్రతతో భూమి కంపించింది. భూమిలో సుమారు 40 కిలోమీటర్ల లోతులో భూకంప తీవ్రత నమోదు అయ్యింది. తాడ్వాయి అడవుల్లో ఆగస్టు 31న జరిగిన ప్రకృతి బీభత్సం కారణంగా రూ.152.64 కోట్ల నష్టం వాటిల్లిందని అటవీ అధికారులు ఇటీవల అంచనా వేశారు. ఆ నాటి భారీ వర్షానికి బలమైన గాలులు తోడు కావడంతో తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లోని అడవులకు తీవ్ర నష్టం కలిగింది. 332.02 హెక్టార్లలో 85,125 చెట్లు కూలిపోవడమో, విరిగిపోవడమో జరిగిందని అధికారులు డ్రోన్ ఫొటోలు, వీడియోల ద్వారా అంచనా వేశారు. ములుగు జిల్లాలో జరిగిన ప్రకృతి విపత్తుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 11వ తేదీన తన ట్విట్టర్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. సుమారు లక్షకుపైగా చెట్లు మేడారం అడవుల్లో కూలాయని, వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఆ ట్వీట్‌లో ఆయన తెలిపారు. ప్రకృతి విపత్తులను అడ్డుకోవాలంటే కలిసికట్టుగా పర్యావరణ సంరక్షణ చేపట్టాలని ఆయన ఆ ట్వీట్‌లో కోరారు. గోదావరి నది సమీపంలో ఉన్న ఈ అటవీ ప్రాంతంపై ప్రకృతి ప్రభావం ఎలా ఉందో శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతానికి సమీపంలోనే బొగ్గు గనులు కూడా ఉన్నాయి. దీంతో భూగర్భ నిపుణులు ఈ ప్రాంత సెసిమిక్ యాక్టివిటీపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.


..........................................................................

## రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్



హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న బుర్రా వెంకటేశం వీఆర్ఎస్ తీసుకోవడంతో ఖాళీ ఆయన స్థానంలో దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దాన కిశోర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# ఇక పిల్లాడికి పెళ్లవుతుందా?



## మారుతున్న అమ్మాయిల ఆలోచనలు



హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:
ఎనబయ్యో దశకం వరకు మగపిల్లలకి పెళ్లి కావాలంటే కనీసం ప్రభుత్వ ఉద్యోగమో, టీచరు లేదా బ్యాంక్ జాబో ఉండాల్సిన పరిస్థితి. దాంతో పాటూ అబ్బాయిల వైపు నుంచి కట్నకానుకల డిమాండ్స్ ఎలాగూ ఉంటాయి. అదే తొంబైల తర్వాత గాలి అమెరికా వైపుకు వీయడం మొదలు పెట్టింది. అమ్మాయిల ఆలోచనల్లో ఇండియాలోనే ఉండే పెద్ద ఉద్యోగం వాడికంటే అమెరికా భర్త
అయితే బాగుంటుందని కోరుకోవడం ఎక్కువయ్యింది. దాంతో ఎన్నారై మ్యాచ్‌లకు గిరాకీ పెరిగింది. కట్నాలు కూడా దానికి తగ్గట్టే ఉండేవి. క్రమంగా రోజులు మారుతూ వచ్చాయి. గల్లీకొ పిల్లడు అమెరికాలో ఉండడం వల్ల, కేవలం ఎన్నారై స్టాటస్ కాకుండా, అబ్బాయికి ఆస్తిపాస్తులుం టేనే పెళ్లికి రెడీ అంటున్నారు అమ్మాయిలు. అబ్బాయిల సంఖ్య పెరిగి, అమ్మాయిల సంఖ్య తగ్గడంతో కట్నాల డిమాండ్స్ కూడా తగ్గుతూ వచ్చాయి. 'మంచి అమ్మాయి దొరికితే చాలు.. కట్నాలక్కర్లేద'నే రోజులు వచ్చాయి. దాంతో అమ్మాయిలకే డిమాండ్ పెరిగింది. కట్నాలు డిమాండ్ చేసే అబ్బాయిలు తగ్గారు. తెలియని వాళ్లకి ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు. కానీ, అబ్బాయిల పెళ్లిళ్ల కోసం వధువుని వెతుక్కుంటూ మ్యాట్రిమోనీ సైట్లల్లో తొంగిచూసే తల్లిదండ్రు లకి కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. తమ కొడుకు అమెరికాలో హెచ్ 1 బి మీద ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడని చెబితే చాలు అమ్మాయిలు క్యూ కడతారు అనుకునే వాళ్లకి చుక్కెదురవుతోం ది. కేవలం అమెరికా ఉద్యోగం సరిపోదంటున్నారు అమ్మాయిలు. ఫ్యామిలీ ఫైనాన్షియల్ స్టాటస్ లోనూ, చదువులోనూ, అందచందాల్లోనూ జస్ట్ యావరేజ్ అనిపించే అమ్మాయిలు అమెరికాలోనూ, ఇండియాలోనూ సొంత ఇళ్లు ఉండాలంటున్నారు. లేదా కనీసంలో కనీసం 10–15 ఎకరాల పొలమైనా ఉండాలట. ఈ తరహా అమ్మాయిల తల్లిదండ్రుల్లో చాలామందికి సొంత ఫ్లాట్ కూడా ఉండట్లేదన్నది ఇక్కడ కఠిన వాస్తవం. అబ్బాయిల తల్లిదండ్రులు నచ్చిన సంబంధం కోసం ఒక ఏడాది కాలయాపన చేసి వెనక్కి వచ్చి చూస్తే ఈ రకం అమ్మాయిల్లో సగం మందికి పెళ్లిళ్లు కుదిరిపోతున్నాయి. అంటే వాళ్లకి కావాల్సిన వరులు దొరికేస్తున్నారని అనుకోవాలి. ఇక కొద్దో గొప్పో ఆస్తి ఉండి, అందచందాలు కూడా ఉంటే ఇక ఆ అమ్మాయిల కోరికలు అన్నీ ఇన్నీ కావు. పదుల కోట్లల్లో ఆస్తులు, విల్లాలు, అమెరికాలో టాప్ యూనివెర్సిటీ బ్యాక్ గ్రౌండ్ ఉండి టాప్ లెవెల్లో జాబ్ ఉన్న అబ్బాయిలు మాత్రమే కాకుండా, కచ్చితంగా గ్రీన్ కార్డ్ వాళ్లు కావాలని కోరుకుంటున్నారు. ఆ రేంజ్ అబ్బాయిలు కూడా ఇలాంటి వాళ్ల కోసం వెతుక్కుని వచ్చి పోటీ పడి పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. లవ్ మ్యారేజీలైతే ఓకే కానీ, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలంటే ఆ పెద్దలకి చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక ఇప్పుడు పరిస్థితి మరీ కఠినంగా మారుతోంది. ట్రంప్ ప్రమాణస్వీకారం తర్వాత అమెరికాలో సీన్ మారుతోంది. హెచ్ 1 బి శాశ్వతంగా ఎత్తేస్తున్నాడని టాక్. అలాగే టాప్ యూనివర్సిటీల్లో సీట్ పొంది మెరిట్లో పాసైన విద్యార్థులకి మాత్రం సత్వరం గ్రీన్ కార్డ్ ఇచ్చేస్తానంటున్నాడు. అంటే వాళ్లకి తప్ప ఎ-క్లాస్ అమ్మాయిలు దొరికే పరిస్థితి ఉండదు ఇండియన్ మ్యారేజ్ మార్కెట్లో. క ఇందాక చెప్పుకున్న యావరేజ్ అమ్మాయిల పరిస్థితి కూడా మారనుంది. వాళ్ల కోరికలు తగ్గించుకోవాల్సిన పరిస్థితి రాబోతోంది. ఎన్నారై సంబంధాలే
కావాలంటే కుదరదు. ఎందుకంటే హెచ్ 1 బి లేకపోతే ఎన్నారై పెళ్లికొడుకులే తగ్గిపోతారు కాబట్టి. ఉన్నంతలో ఇండియాలోనే పెద్ద ఉద్యోగం, మంచి సంపాదన ఉన్నవాళ్లని వెతుక్కోవచ్చు. అమ్మాయిల్లో ఈ కాంప్రమైజ్ వల్ల అబ్బాయిలకి పెళ్ళిళ్లు ఈజీగా అవుతాయా అంటే చెప్పలేం. ఎందుకంటే మారిన సినారియోలో ఇండియాలో నిరుద్యోగులు పెరిగే అవకాశాలున్నాయి. కొద్దో గొప్పో ఉద్యోగాలుంటేనే పరిస్థితి కష్టంగా ఉంటే, ఇక ఉద్యోగం లేని అబ్బాయిల్ని చేసుకునేదెవరు? ఆస్తులుంటే కాస్త పర్వాలేదనుకోవాలి. అందుకే ఈ పరిస్థితిని దాటాలంటే అమెరికాని వదిలేసి మరో దేశాన్ని వెతుక్కోవాలేమో భారతీయ యువకులు. అలా అనుకుందామనుకున్నా అమెరికా
తర్వాత డిమాండ్ ఉన్న దేశం కెనెడా. అక్కడ జాబ్ మార్కెట్ అమెరికా అంత స్ట్రాంగ్ కాదు. ఆ తర్వాత యూకే. అది ఆల్రెడీ ఇబ్బందుల్లో ఉంది. అసలక్కడ చదివిన ఏ భారతీయుడైనా తిరిగి ఇంటికొస్తున్నాడే తప్ప అక్కడ జాబ్ పొందడం చాలా కష్టంగా ఉంది. ఇక మిగిలింది ఆస్ట్రేలియా. అక్కడ కూడా జాబ్ వీసాలు కఠినమయ్యాయి. మరి ఎప్పటికప్పుడు పెరిగిపోతున్న భారతీయ యువ జనాభాకి ప్రపంచంలో మంచి చోటెక్కడ అనేది ప్రశ్న. దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

# నేడు ఇందిరమ్మ యాప్ ఆవిష్కరణ

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:
తెలంగాణలో నిరుపేదలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న సొంతింటి కల సాకారం కానుందని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని ఇందిరమ్మ ఇళ్లపై రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేస్తూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రాజకీయ ప్రమేయానికి తావు లేకుండా అర్హులను ఎంపిక చేయడానికి వీలుగా ఈ మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ యాప్‌ను సిఎం రేవంత్ రెడ్డి గురువారం ఆవిష్కరించనున్నారని ఆయన తెలిపారు. 6వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులే స్వయంగా ఊరురా వస్తారన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇళ్ల పథకం అమలుకు ఉన్న అవరోధాలను అధిగమిస్తూ అమలుకు అవసరమైన



కార్యాచరణను వేగవంతం చేసిందని ఆయన తెలిపారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ అంటేనే ఇందిరమ్మ ఇళ్లు అని, ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పేటెంట్ అని ఆయన తెలిపారు. ఈ రోజు రాష్ట్రంలో ఏ గ్రామానికి, ఏ తండాకు పోయినా, ఏమారుమూల ప్రాంతానికి పోయినా ఇందిరమ్మ ఇళ్లే కనబడతాయన్నారు. ఈ ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు ఒక వంతు అయితే, తాము కట్టించే ఇందిరమ్మ ఇళ్లు మరో వంతు అని ఆయన తెలిపారు. తాము గర్వంగా చెబుతున్నామని, ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించి ఇస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్కో ఇంటికి 5 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా పేరు మీద ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఇళ్లకు నాలుగు దశల్లో లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఈ పథకం కింద నిర్మించే ఇండ్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యాలను కలిగి ఉంటాయని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేదని, ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దుచేసి లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. లబ్ధిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా నిర్మించుకోవచ్చని, రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాలను చేపడతామమని మంత్రి ప్రకటించారు.

## ప్రతి ఆడబిడ్డకు బాకీ పడ్డ రూ.30 వేలు చెల్లించాలి: ఎంఎల్‌సి కవిత

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:
అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంటపడుతూనే ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. ప్రభుత్వంలో జరిగే తప్పులను తెలంగాణ జాగృతి సంస్థ ఎప్పటికప్పుడు ఎత్తిచూపిస్తుందన్నారు. బుధవారం నాడు తన నివాసంలో జరిగిన తెలంగాణ జాగృతి వరంగల్, నల్గొండ జిల్లాల నాయకుల సమావేశంలో ఎంఎల్‌సి కవిత ప్రసంగించారు. ముఖ్యమంత్రి తమకు ఏదో చేస్తారన్న విశ్వసం ప్రజల్లో లేదని అన్నారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఇవ్వడం లేదని పేర్కొన్నారు.
నెలకు రూ. 2500 చొప్పున రూ. 30 వేలు ఒక్కో మహిళకు సిఎం బాకీ ఉన్నారని చెప్పారు. రూ. 2 వేలు పెన్షన్ పెంచామని చెప్పారు కానీ పెంచలేదని, ఆ మొత్తం కూడా ఒక్కొక్కరికి రూ. 24 వేలు సీఎం బాకీ పడ్డారని, వీటన్నింటిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళి అర్పించినవాళ్లవుతారని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్పు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి మళ్లింపు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే తెలంగాణ సంస్కృతి అని తెలిపారు.
కాంగ్రెస్ పార్టీ ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదు కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని, ఇప్పుడు అక్కడ కేంద్ర బలగాలు మోహరించాయని తెలిపారు. నరసింహావతారంలా పేగులు మెడల వేసుకుంటా అని సిఎం అంటున్నారు కదా..? నిజంగా ధైర్యం ఉంటే నాగార్జున సాగర్ వద్ద నరసింహావతారం ఎత్తి కేంద్ర బలగాలను వెనక్కి పంపించి మన నీళ్లు మనకు



తీసుకురావాలని సవాలు చేస్తున్నానని వ్యాఖ్యానించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే సిఎం రేవంత్ రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు.

# వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారీని ప్రారంభించిన కొండ సురేఖ..






ప్రజావినికిడి,:డిసెంబర్ 4(హైదరాబాద్):

బుధవారం రోజు హైదరాబాద్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారీని గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ( టి జి ఎఫ్ డి సి) సహకార సైమాక్స్ ఇన్ఫోటైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన ఈ సంచలనాత్మక ప్రాజెక్ట్. అడ్వాన్స్‌డ్ వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) టెక్నాలజీల ద్వారా ఎకో-టూరిజం మరియు వన్యప్రాణుల అన్వేషణను పునర్నిర్వచించేలా ఈ ప్రాజెక్ట్ సెట్ చేయబడిందని సైమాక్స్ సీఈఓ గౌరీ శంకర్ మామిడి తెలిపారు.వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారి విద్య అలాగే వినోదాన్ని వినూత్న మార్గాల్లో విలీనం చేసే లీనమయ్యే అనుభవాల శ్రేణిని అందిస్తుంది. సందర్శకులు వర్చువల్ సఫారీని ప్రారంభించవచ్చు,అది లైఫ్‌లైఫ్ వన్యప్రాణుల ఎన్‌కౌంటర్లని అనుకరిస్తుంది లేదా ఉత్తేజకరమైన వి ఆర్ నైట్ సఫారీని పరిశోధించవచ్చు, ఇది రాత్రిపూట వన్యప్రాణుల కార్యకలాపాల యొక్క సురక్షితమైన ఉత్కంఠభరితమైన సంగ్రహావలోకనం అందిస్తుంది.వి ఆర్ అక్వేరియం అసమానమైన వాస్తవికతతో శక్తివంతమైన నీటి అడుగున ప్రపంచాన్ని అన్వేషించడానికి సందర్శకులను ఆహ్వానిస్తుంది, అయితే వి ఆర్ స్పేస్ టూరిజం ఫీచర్ వారిని అంతరిక్షంలోని అద్భుతాలను చూసేందుకు భూమిని దాటి సంతోషకరమైన ప్రయాణాన్ని తీసుకువెళు తుంది.సాహసానికి జోడిస్తూ, సందర్శకులు వి ఆర్ ఫిషింగ్ అలాగే వి ఆర్ కయాకింగ్ వంటి కార్యక్రమాలను సుందరమైన వర్చువల్ సెట్టింగ్‌లలో ఆనందించవచ్చు, అన్ని వయసుల వారికి థ్రిల్లింగ్ ఎస్కేడ్‌లను అందిస్తారు.ఏ ఆర్ జూ ఆగ్మెంటెడ్ రియాలిటీ జంతువులతో ప్రత్యక్ష పరస్పర చర్యను ప్రారంభిస్తుంది,విద్య మరియు వినోదం యొక్క ప్రత్యేక సమ్మేళనాన్ని సృష్టిస్తుంది. అదనంగా,ఏ ఆర్ సైక్లింగ్ సాంకేతికత ఆరుబయట కలిసే మెరుగైన ప్రకృతి ట్రయల్ అనుభవాన్ని అందిస్తుంది.

ప్రారంభోత్సవంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ,ప్రపంచ స్థాయి వినోద అనుభవాన్ని అందిస్తూనే పర్యాటకం మరియు పర్యావరణ అవగాహనను ప్రోత్సహించడంలో ఈ చొరవ పరివర్తనాత్మక ముందడుగు అని కొనియాడారు. బొటానికల్ గార్డెన్‌లోని వర్చువల్ వైల్డ్‌లైఫ్ సఫారీ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంది.

# శ్రీ శంకర్ కాలనీలో డ్రైనేజీ లు అస్తవ్యస్తం

## త్వరలో డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి..

### కార్పొరేటర్ పవన్ కుమార్..



ప్రజావినికిడి,(క్రొత్తపేట): బుధవారం రోజు శ్రీ శంకర్ కాలనీలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ కాలనీ వాసులతో కలిసి కాలనీలో ఉన్నటువంటి సమస్యలను కార్పొరేటర్ పవన్ కుమార్ పరిశీలించడం జరిగింది.శ్రీ శంకర్ కాలనీలో డ్రైనేజ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని గతంలో వేసినటువంటి డ్రైనేజీ లైన్లు అంతా పాడైపోయి నిత్యం నీళ్లు పొంగిపొర్లుతుండటంతో కాలనీ ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారుతుందని కార్పొరేటర్ కు కాలనీవాసులు తెలియజేసారు. వెంటనే వారు డివిజన్ జలమండలి అధికారులు ఏ ఈ స్రవంతి రెడ్డి ని పిలిపించి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు.కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ సమస్యలపైన చర్యలు తీసుకోవాలని నూతన డ్రైనేజ్ లైన్లు ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులను కోరారు. అలాగే కాలనీలో ఉన్నటువంటి అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ గతంలో పైకప్పు కూలిపోవడంతో కమ్యూనిటీ హాల్ మరమ్మత్తులు చేయించాలని అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో, డివిజన్ జిహెచ్ఎంసి ఏఈ మాతృనాయక్ తో కలిసి కమ్యూనిటీ హాల్ ని పరిశీలించడం జరిగింది.అనంతరం మరమ్మత్తులు చేయించేలా చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. మరియు కాలనీలో ఉన్నటువంటి విద్యుత్ స్తంభాలు,వీధి దీపాలు,రోడ్డు సమస్యలను కార్పొరేటర్ కాలనీవాసుతో కలిసి పరిశీలించి వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలన్ని తీరేలా చూస్తామని కాలనీవాసులకు తెలియజేశారు. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, రమేష్ చారి,సంగీత, భాస్కర్,దయాకర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నరేందర్‌రెడ్డి క్వాష్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు




హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. లగచర్ల దాడి ఘటనలో ఏ1గా ఉన్న పట్నం నరేందర్ రెడ్డి.. కొడంగల్ కోర్టు రిమాండ్ విధించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ఇటీవల పిటిషన్ వేశారు. లగచర్ల ఘటనలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని కోరారు. పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు దాన్ని తిరస్కరించింది. బెయిల్ పిటిషన్‌పై కింది కోర్టు విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## మళ్లీ భూకంపం వచ్చే అవకాశం : నిపుణులు

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం భూ ప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. ములుగు కేంద్రంగా వచ్చిన ఈ భూకంపం ప్రభావంతో దాదాపు 225 కి.మీ. వ్యాసార్ధంతో భూమి 5 సెకండ్ల దాకా కంపించింది. ఈ నేపథ్యంలో భూ ప్రకంపనలకు గల కారణాలపై ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు స్పందించారు. భూకంప తీవ్రత 6 వరకు ఎలాంటి ప్రమాదం లేదని ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ శేఖర్ తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో భూ ప్రకంపనలు కామన్ అని చెప్పారు. మళ్లీ భూ ప్రకంపలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే తమ అంచనా ప్రకారం భూ ప్రకంపనల తీవ్రత 6కు మించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. 1969లో భద్రాచలంలో అత్యధికంగా 5.7 తీవ్రతతో నమోదైందని తెలిపారు. భూప్రకంపనలతో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కాగా, గోదావరి పరివాహక ప్రాంతంలో భూ ప్రకంపనలు వచ్చాయని ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపైనే ఎక్కువ ప్రభావం ఉందని పేర్కొన్నారు. నది పరివాహక ప్రాంతాల నుంచి 300 కి.మీ.వరకు భూకంప ప్రభావం ఉంటుందని అన్నారు. అందువల్లే హైదరాబాద్‌లో భూమి కంపించిందని వివరించారు. మళ్లీ భూ ప్రకంపనలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాత భవనాలు, పగుళ్లు వచ్చిన భవనాలను ఖాళీ చేయడం మంచిదని సూచించారు

## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు



హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు 20 మంది అనుచరులపై సైతం కేసు నమోదైంది.

విధులను అడ్డగించడంతో పాటు బెదిరింపులకు దిగారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కాగా,, ఫోన్ ట్యాపింగ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు పాడి కౌశిక్‌రెడ్డి పీఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, సీఎం రేవంత్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్‌రెడ్డి కలిసి తన ఫోన్‌ని ట్యాప్ చేస్తున్నారని.. వీరిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేసేందుకు ఆయన పీఎస్‌కి వెళ్లారు.%బంజారాహిల్స్ ఏసీపీకి ఇవాళ ఉదయం ఫోన్ చేస్తే 3 గంటలకు రమ్మన్నారని.. తాను స్టేషన్‌కు వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని.. సీఐ సైతం వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తే తనతో పార్టీ కార్యకర్తలు ప్రశ్నించారన్నారు. తాను ఎమ్మెల్యే అనే గౌరవం లేకుండా సీఐ ప్రవర్తించారని.. డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని సీఐకి ఉంటుందని.. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఓ మిత్రుడి పార్టీకి వెళితే శివధర్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసి.. అక్కడికి పోలీసులను పంపారని.. నా దగ్గర డ్రగ్స్ పెట్టించి కేసు పెట్టించాలని శివధర్ రెడ్డి ప్రయత్నించారన్నారు. సీఎం రేవంత్, శివధర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రియదర్శిని పార్క్ ను పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..

ప్రజావినికిడి,(ఎల్బీనగర్):

సరూర్ నగర్ ప్రియదర్శిని పార్క్ నందు జరుగుతున్న అభివృద్ధి పనులను ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక నాయకులచే కలిసి పార్క్ ను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో పార్కుల అభివృద్ధి విషయంలో పార్కుల యొక్క స్వరూపం మార్చడం జరిగింది అని తెలిపారు.దానిలో భాగంగా గత 17 సంవత్సరాల నుంచి ఇట్టి పార్క్ కు ఎంతో మంది సందర్శకులు ఇట్టి పార్కు కు రావడం జరుగుతుంది.దానికి తగ్గట్లుగా ఇట్టి ప్రియదర్శిని పార్క్ నందు ప్రస్తుతం పూర్తి స్వరూపం మార్చడం జరుగుతుంది అని గుర్తు చేశారు.ఇట్టి పార్క్ నందు అనేక మార్పులు చేయడం జరుగుతుందని అన్నారు.పర్యాటకులు పార్కుకు రావడానికి ఇట్టి పార్క్ ప్రవేశ ద్వారం నందు ఒక అందమైన నెమలి ఆకారం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అలాగే పర్యాటకులు కూర్చోవడానికి గజీబులు,ఓపెన్ జిమ్స్,వాలీబాల్ అడుకోవడానికి అనువైన స్థలం,యోగ చేసుకోవడానికి యోగ సెంటర్,అత్యాధునిక మూత్రశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పార్క్ నందు మొక్కలు



ఎండకుండా మరొక బోరు కూడా వేయించడం జరిగింది అని తెలిపారు.నియోజకవర్గ పరిధిలోని అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్స్ కూడా ఎర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పార్క్ కు వచ్చే ప్రజలకు కంటికి ఇంపుగా ఉండే విధంగా చర్చిదిద్దడం జరుగుతుంది అని తెలిపారు.అలాగే ఇట్టి పార్కులో సందర్శకులు కూర్చోవడానికి పచ్చిక బయళ్లు కూడా నూతనంగానిర్మించడం జరుగుతుంది. అని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడా డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి,రాకేష్ ఠాగూర్,తోట రాజశేఖర్,భాస్కర్ గంగపుత్ర,తిలక్ రావు,జగన్నాథ్ రెడ్డి,మధుసాగర్,శ్రీకాంత్,ఆశిష్,టీంకు,నరేష్,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ పరిధిలో 18 వ మెట్టు పూర్తి చేసుకున్న సందర్భంగా కాల్వ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో

# ఘనంగా మహా పడిపూజ మహోత్సవం

ప్రజావినికిడి,(పెద్ద అంబర్పేట్):

పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కళ్లెం బాల్ రెడ్డి గార్డెన్స్ లో 18 మెట్టు గురుస్వామి కాల్వ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం నాడు 18వ మెట్టు పూర్తి చేసుకున్న సందర్భంగా మహా పడిపూజ అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ రాజన్ నంబుద్రి నేతృత్వంలో 18వ మహాపడి పూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో అయ్యప్ప ప్రాంగణం అంతా మార్మోగింది.ఈ మహపడిపూజ మహోత్స వానికి పెద్దఎత్తున అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం,భజన పాటలు,భక్తి గీతాలను ఆలపించారు.ఈ పూజలో ముందుగా గణపతి హోమం గణపతి పూజ కుమారస్వామి పూజతో పాటు అయ్యప్ప స్వామికి పూజ నిర్వహించి పూలు పండ్లు నూతన వస్త్రాలు నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం అయ్యప్ప పాటలు మాల ధరించిన అయ్యప్ప స్వాములను నృత్యాలతో ఆడుతూ పాడుతూ భక్తిశ్రద్ధలతో అయ్యప్ప నామ స్మరణతో



మార్మోగింది.అయ్యప్ప నామస్మరణతో పాటు ఆట పాటలు నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. బ్రహ్మశ్రీ రాజన్ నంబుద్రి మాట్లాడుతూ,18వ మెట్టు గురుస్వామి కాల్వ సుబ్రహ్మణ్యం ఆహ్వానం మేరకు పెద్ద అంబర్పేట్ లో ఘనంగా అయ్యప్ప స్వామి 18 వ మహా పడిపూజ నిర్వహించామని.ఈ పడిపూజ కార్యక్రమంలో గురు స్వాములు,కన్నె స్వాములు, గంటసాములు,కత్తి సాములు బంధుమిత్రులు పాల్గొన్నారు.41 ఒక రోజు మండల పూజను నిర్వహిస్తారు.మహా పడిపూజలో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక చింతనతో మనిషికి ప్రశాంతత దొరుకుతుందని అయ్యప్ప స్వామి ఆశీస్సులు వీరి కుటుంబ సభ్యులకి ఉండాలని ఆయన కోరారు.ఈ సంవత్సరం కన్నె స్వాములు అయ్యప్ప మాల ధరించడం చాలా సంతోషకరమని 41 రోజులు నియమ నిష్ఠలతో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామిని కొలిచి శబరిమల యాత్రకు వెళ్లేవారు తీసుకోవాలనివారు సూచించారు. శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లేవారు ప్లాస్టిక్ వస్తువులు తీసుకువెళ్తే పరిసరాలు కలుషితం అవుతాయని,గురు స్వాముల సూచనల మేరకే శబరిమల యాత్రకు బయలుదేరాలని వారు సూచించారు. అనంతరం కాల్వ సుబ్రహ్మణ్యం గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప మాల వేసుకుని 18 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఈసారి 18 మహా పడిపూజ నిర్వహించామని ఈ పడిపూజ కార్యక్రమానికి గురు స్వాములు స్వాములకు,స్వామి మాలదారులు,ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బంధువులు స్థానిక నాయకులు మండల చుట్టుపక్కల ప్రజలు గురు స్వాములు,అయ్యప్ప స్వాములు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

## ఏపీ ప్రజలకు సంక్రాంతి కానుక
# మహిళలకు ఉచిత బస్సు?




హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మరో భారీ శుభవార్త చెప్పనున్నారు. సంక్రాంతి కానుకగా మరో సంచలన పథకాన్ని అమలు చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతి సారీ సంక్రాంతి వచ్చిందంటే చాలు రాష్ట్ర ప్రజలకు ఏదో ఒక రూపంలో కానుకలు అందించేవారు. అయితే ఈ సారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టిన కూటమి మరికొద్ది రోజుల్లో రానున్న సంక్రాంతికి ఎటువంటి కానుకలు ఇవ్వనుందో అని ప్రజలలో లోనూ ఆసక్తి నెలకొంది.కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రజలు కూటమి మేనిఫెస్టోలో ఉన్న వాటిని ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేశారు.ఈ తరుణంలో వచ్చే సంక్రాంతికి ఏ పథకాన్ని సీఎం చంద్రబాబు సర్కార్ అమలు చేయబోతోందోనని ప్రజలు వేయి కళ్లతో చూస్తున్నారు. అయితే గతంలో కూటమి సర్కార్ ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ప్రభుత్వం దీనికి సంబంధించి ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. తాజాగా ఈ పథకాన్ని సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో అమలు చేస్తే మహిళలకు మేలు జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ పథకాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించే యోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు.మరోవైపు ఈ పథకానికి సం బంధించి ప్రభుత్వం ఇప్పటికే పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో ప్రత్యేక బృందాల ద్వారా అధ్యయనం చేసి డీటెయిల్డ్ రిపోర్ట్ తయారు చేసినట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమలు చేయడా నికి కావాల్సిన విధివిధానాలు, ఏ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి, ఆర్టీసీపై పడే భారం, రాష్ట్ర ఖజానాపై పడే భారాలపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం.రాష్ట్రంలోని పలువురు మంత్రులు ఇదివరకే ఈ పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. త్వరలోనే ఈ పథకానికి కావాల్సిన, అవసరమైన నిధులు, కేటాయిం చాల్సిన బస్సులు వంటి వాటిపై ఆర్టీసీ అధికారులతో ప్రభుత్వం చర్చలు జరిపే అవకాశం ఉంది. అయితే సంక్రాంతికి కూటమి సర్కార్.. ఉచిత బస్సు పథకం మే కాకుండా తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1,500 ఆర్థిక సాయం పథకాల్లో ఏదో ఒకదానిని అమలు చేసే అవకాశం ఉంది. ఈ పథకాల అమలుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. వీలైనంత త్వరగా ప్రభుత్వం వీటిని అమలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఈ పథకాలు అమలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు భారీ లబ్ది చేకూరనుంది.

# భూమాఫియా బాధితులకు న్యాయం చేస్తాం...!

**మాఫియా లాక్కున్న ఆస్తుల్ని సీజ్ చేసే చట్టం ఉందేమో చూస్తాం**

**బెదిరించి ఆస్తులు రాయించుకోవడం, వాటాలు తీసుకోవడం దేశ చరిత్రలో లేదు**

**జగన్ జమానాలో జరిగిన విద్యుత్తు ఒప్పందాల్ని అధ్యయనం చేస్తున్నాం**

**విలేకర్లతో సీఎం చంద్రబాబు**



అమరావతి డిసెంబర్ 4 ప్రజావినికిడి,:

అధికారాన్ని అడ్డుపై ట్టుకొని వైకాపా పాలకులు, వారి అండతో కొందరు గన్ను పెట్టి బెదిరించి ఆస్తులు రాయిం చుకున్నారని, వాటాలు లాక్కున్నారని, పెద్ద ఎత్తున భూదందాలు చేశారని.. ఇలాంటివి దేశ చరిత్రలోనే ఎప్పుడూ జరగలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. తన సుదీర్ఘ రాజ కీయ జీవితంలోనూ ఎప్పుడూ 'చూడలేద న్నారు. భూ మాఫి యాను అరికడతాము. ఆస్తులు కోల్పోయిన బాధి తులకు న్యాయం చేస్తా మని హామీ ఇచ్చారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన కాసేపు విలేకర్లతో ముచ్చటించారు. మహారాష్ట్రలో దావూద్ ఇబ్రహీంలాంటి ముఠాలు ప్రజల్ని బెదిరించి, భయపెట్టిఆస్తులు రాయించుకుంటే వాటిని సీజ్ చేసేచట్టం అమల్లో ఉందని.. మనకూ అలాంటిచట్టం తెస్తే బాగుంటుందని విలేకరులు చెప్పగా. ..అలాంటి చట్టం ఉంటే దానికి సంబంధించిన సమాచారాన్ని తెప్పించుకుంటామని సీఎం అన్నారు. 'ఇప్పటికే భూ అక్రమణల చట్టం తీసుకొచ్చాం. ఈ చట్టం పనితీరు, కాకినాడ. కోర్టు, సెజ్లో బలవం తంగా వాటాలు రాయిం చుకొన్న వ్యవహారం దీని పరిధిలోకి వస్తుందో, లేదో పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు పెట్టాలు ఇవి పూర్తయ్యేలోపు క్షిత స్థాయ్ని పరిస్థితులు, సమస్యలు పూర్తిగా తెలుస్తాయి వీటి ద్వారా సమస్య పరిష్కరిస్తాం అని బాబు ఒప్పుగాలతో రాష్ట్రంపై వారు పడుతోంది విలేలే రులు ప్రస్తావించగా.. 'ఒకసారి ఒప్పందం జరుగా ఇప్పుడు వాటిని ఉల్లంఘిస్తే మబ్బులు రూ. అధ్యయనం చెస్తాం' అని చెప్పారు.శాఖల హద్దులు.. పనితీరును సర్వనాశనం చేశాడు. గత ప్రభుత్వంలో ఎన్నో విదాలుగా అవినీతి అరితీయను నాశనం చేశారు. ఏ సమస్య ఏ శాఖ పరిధిలోని వన్మిందో తెలియకుండా చేశారు. ఆర్థిక ఇబ్బందులుసరిచేయాణుటి సమయం పడుతుంది. గ్రీనెసగోళ జరుగుతున్న ఆ పరిశీలించి, తన త్సాలకు ప్రభుత్వ ఖన్నుతో లారీలు పెట్టి ప్రారంభించాం. పిర్యాదు చేయవచ్చు. గోనెసంచుల సమస్యల్లి పరిశీ చేప్పటికే ఆవకారున్ని ఆవేశంచామన్నారు.కాగితాలు తీసుకోవడం కాదు.. ప్రతి తీసుకొని ప్రాధాన్య క్రమంలో వనిస్తా కొన్ని అసాధ్యమైన దీని గురించే 'చేస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు..315 ధాన్యం బస్తాలు లోడ్ చేసి.. 290 కొన్నట్లు చూపిస్తున్నారు.అధికారం అండతో గన్ను పెట్టి ఆస్తులు రాయించుకోవడం జగన్ కు మాత్రమే చెల్లిందని సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్నడూ కనీవిని ఎరుగని విధంగా వ్యాపారాల్లో వాటాలు తీసుకున్న ఘటనలు దేశ చరిత్రలోనే లేవని అన్నారు.. అయితే జగన్ పాలనలో దీనిని తిరగరాశారని ఆరోపించారు.. అమరావతి లోని ఎన్టీఆర్ భవన్లో నేడు ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, ఇటువంటి నేరాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాల్సి ఉందని అన్నారు."కొత్త తరహా నేరాల పట్ల చర్యలపై ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోంది. వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం ఇప్పుడే చూస్తున్నాం. ముంబయిలో మాపియా బృందాలు లాక్కునే ఆస్తులను సీజ్ చేసే చట్టం ఉంది. ఆ విషయంపై సమాచారం తెప్పించుకుంటాం" అని చెప్పారు. అలాగే అమరావతితో తాను స్థిర నివాసం ఏర్పరుచుకుంటునట్లు వెల్లడించారు.. ఇంటి నిర్మాణం కోసం స్థలం కొనుగోలు చేశామని ,త్వరలోనే శంఖుస్థాపన చేస్తామని చెప్పారు..

# ప్రజాపాలన విజయోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,: : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 7,8,9 తేదీల్లో జరిగే ముగింపు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ప్ర జాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై బుధవా రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, హెూం శాఖ ప్ర త్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రా మకృష్ణారావు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి కాస్ రాజ్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీఏడీ ముఖ్య కా ర్యదర్శి రఘునందన్ రావు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ఉత్సవాల చివరి మూడు రోజుల్లో సచివాలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రిచే తెలంగాణా తల్లి విగ్రహావిష్కరణ తోపాటు మూడు రోజుల పాటు సినీ రంగ ప్రముఖులచే మ్యూజిక ల్ నైట్, నగరంలోని ప్రముఖ హెూటళ్లు, డ్వాక్రా, రెస్టారెంట్లు, సంస్థలచే స్టాళ్ళ ఏర్పాటు, భారీ ఎత్తున డ్రోన్ షో, లేజర్ షో, క్రాకర్స్ షో తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



డిసెంబర్ 7న వందేమాతరం శ్రీనివాస్ బృందం, 8న రాహుల్ సిప్లిగంజ్, 9న థమన్‌చే సినీ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 9న ప్రధాన కార్యక్రమం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేస్తారని, అనంతరం సభా కార్యక్రమం, గతంలో లేని విధంగా డ్రోన్ షో, లేజర్ షో, క్రాకర్ ప్రదర్శన అనంతరం థమన్ చే ఐమాక్స్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ నుండి పీవీ మార్గ్ వరకు ఐదు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికల్లో భిన్న రీతుల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదే మార్గంలో ఫుడ్ స్టాళు ,, హస్తకళల స్టాళ్లు, పలు శాఖల స్టాళ్లతో దాదాపు 120 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యువతకై సెల్ఫీ పాయింట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ట్యాంక్ బండ్ నుండి రాజీవ్ గాంధీ జంక్షన్, సచివాలయం, ఇందిరా గాంధీ ఐమాక్స్ జంక్షన్ నుండి పీవీ నర్సింహా రావు మార్గ్ వరకు రంగు రంగుల విధ్యుత్ దీపాలతో అలంకరించాలని తెలిపారు.

ఈ మూడు రోజుల పాటు పెద్ద సంఖ్యలో నగర వాసులు వచ్చే అవకాశమున్నందున వారికి తాగునీరు, టాయిలెట్ల ఏర్పాట్లు, తగు భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానంగా 9న తెలంగాణా తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఒక లక్ష మంది హాజరయ్యే అవకాశమున్నందున తగు ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో పర్యటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాష్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, జలమండలి ఎం.డి అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశాల్లో పలు అంశాలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై అధికారికంగా ప్రకటన వెలువడినా ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహిస్తారనేది ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయం ఉంటుంది. ఇప్పటికే జనవరి సంక్రాంతి తరువాత రైతు భరోసా వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.అయితే అందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం కూడా ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా అర్హులైన రైతులకే దక్కేట్లు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ బిల్లును సైతం ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్తగా తీసుకురానున్న ఆర్వోర్ చట్టంతోపాటు, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే ద్వారా వచ్చే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# కొణిజేటి రోశయ్య నిఖార్సైన హైదరాబాదీ: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 4 ప్రజావినికిడి,:

దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నిఖార్సైన హైదరాబాదీ అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. తనకు రెండు తెలుగు రాష్ట్రాలు సమానమేనని ఆయన ఎప్పుడూ చెప్పేవారన్నారు. రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని హైటెక్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్‌గా ఆవిష్కృతమైందన్నారు.తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోశయ్య తనను ఛాంబర్‌కు పిలిపించుకొని ఎన్నో విలువైన సూచనలు చేశారన్నారు. బాగా మాట్లాడుతున్నానంటూ తనపై ప్రశంసలు కురిపించడంతో పాటు మరింత అధ్యయనం చేసి శాసనసభకు రావాలని చెప్పారని గుర్తు చేసుకున్నారు. తమిళనాడు గవర్నర్‌గా అద్భుతంగా పని చేశారన్నారు. పాలకపక్షంలో ఉంటే ప్రతిపక్షాన్ని.. ప్రతిపక్షంలో ఉంటే అధికార పార్టీని, సీఎంను ఇరుకున పెట్టే విధానాన్ని ఆయన నుంచి నేర్చుకోవాలన్నారు.అప్పుడు ఎవరు ముఖ్యమంత్రులుగా ఉన్నా.. నెంబర్ 2 పొజిషన్ మాత్రం రోశయ్యదే అని గుర్తు చేశారు. నెంబర్ వన్‌లో ఉన్న సీఎం మాత్రమే మారుతుండేవారన్నారు. మర్రి చెన్నారెడ్డి, నేదురమల్లి జనార్ధన్ రెడ్డి, భవనం వెంకట్రామ్, అంజయ్య, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి... ఇలా ఎందరో సీఎంల వద్ద నెంబర్ 2గా ఉన్నారన్నారు. వీరంతా ప్రభుత్వాన్ని ప్రశాంతంగా నడిపించడానికి కారణం రోశయ్యే అన్నారు.సీఎం కావాలని రోశయ్య ఎప్పుడూ కోరుకోలేదని, కానీ సమయం వచ్చినప్పుడు సోనియాగాంధీ ఆయనకు అవకాశం ఇచ్చారని తెలిపారు. తనకు పదవులు కావాలని ఏనాడూ అధిష్ఠానాన్ని కోరలేదు. కానీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో రోశయ్యకు సీఎం పదవి అప్పజెప్పారంటే ఆయన పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం ఎలాంటిదో తెలిసిపోతోందన్నారు. రోశయ్య హెూదాను కోరుకోలేదు... వాటంతట అవే వచ్చాయన్నారు.తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే ఆర్యవైశ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. వారి వ్యాపారాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీలోనూ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ నగరంలో రోశయ్యకు విగ్రహం లేకపోవడం పెద్ద లోటు అన్నారు. ఆర్యవైశ్యులు మంచి ప్రాంతాన్ని ఎంపిక చేస్తే ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడతామన్నారు. వచ్చే వర్ధంతి నాటికి దానిని పూర్తి చేస్తామన్నారు.



# జాట్ మాస్ ఫీస్ట్

## గోపీచంద్, సన్నిడియోల్ ఇంట్రెస్ట్ న్యూస్

టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని బీటౌన్ డెబ్యూ ఇస్తున్నాడని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీడియోల్ హీరోగా ఎస్‌డీజీఎంగా రాబోతున్న ఈ చిత్రానికి జాట్ టైటిల్‌ను ఫైనల్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఇప్పటికే మాస్ ఫీస్ట్ లోడింగ్ అంటూ మేకర్స్ లాంచ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. బుధవారం సాయంత్రం 4:05 గంటలకు ఎక్జయిటింగ్, భారీ అనౌన్స్‌మెంట్ అంటూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బీటౌన్ స్టార్ యాక్టర్ రణ్‌దీప్ హుడా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. రిషి పంజాబి సినిటోగ్రాఫర్ కాగా.. అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై మేకర్స్ రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు.




# నెత్తుడి పిడికిలి బిగించిన చిరంజీవి

## శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్

ప్రస్తుతం విశ్వంభర సినిమాతో బిజీగా ఉన్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి. సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగా.. మరోవైపు దసరా ఫేం శ్రీకాంత్ ఓదెలతో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. అలా అప్‌డేట్ ఇచ్చేశారో లేదో..? సినిమా ఉండబోతుందోనని ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న అభిమానులకు స్టన్నింగ్ ఫొటోతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.మెగాస్టార్ చిరంజీవితో పిడికిలి బిగించిన స్టిల్‌ను షేర్ చేశాడు. బ్యాక్‌డ్రాప్‌లో చిరు, శ్రీకాంత్ ముఖాలను కనిపించకుండా.. నెత్తుటితో పిడికిలి బిగించిన స్టిల్‌ను హైలెట్ చేస్తూ తీసిన ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. సినిమా వయొలెన్స్‌గా (హింసాత్మకంగా) ఉండబోతుందని ట్వీట్ చేశాడు. ఒక్క స్టిల్‌తో సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. శ్రీకాంత్ ఓదెల ఓ వైపు నానితో రెండో సినిమాను డైరెక్ట్ చేస్తూనే.. మరోవైపు మెగాస్టార్ సినిమాను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించబోతున్నారు. ఈ ప్రాజెక్టులో చిరంజీవిని చాలా ఫ్రెష్ లుక్‌తో నయా అవతార్‌లో చూపించబోతున్నాడట.



# 'డాకు మహారాజ్' - ఓ పనైపోయింది!



నందమూరి బాలకృష్ణ మరోసారి తన మాస్ యాక్టింగ్ తో ప్రేక్షకులని మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆయన లేటెస్ట్ మూవీ 'డాకు మహారాజ్' షూటింగ్ గత కొన్నిరోజులుగా శరవేగంతో కొనసాగుతోంది. అయితే అనుకున్న సమయానికి వర్క్ ఫినిష్ చేస్తారా లేదా అని అనుమానాలు కలుగుతున్న టైమ్ లో ఫైనల్ గా టీమ్ పని పూర్తి చేసింది. మొత్తానికి డాకు మహరాజ్ షూటింగ్ పూర్తయింది. బాబీ కొల్లి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న భారీ స్థాయిలో విడుదల కానుంది. 'డాకు మహారాజ్' సినిమా మొదట అనౌన్స్ చేసినప్పటినుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. టైటిల్ టీజర్‌తో ఆ అంచనాలు మరో స్థాయికి చేరాయి. బాలకృష్ణ కొత్త లుక్, యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులని కట్టిపడేశాయి.ప్రతీ ఫ్రేమ్ లోనూ గ్రాండ్ విజువల్స్ కనిపించి, ఈ సినిమా థియేటర్లలో ఓ మర్చిపోలేని అనుభవాన్ని అందిస్తుందనే నమ్మకాన్ని అందించింది. బాబీ కొల్లి బాలకృష్ణను కొత్త కోణంలో చూపించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇప్పటివరకు బాలకృష్ణ నటించిన చిత్రాల్లో ఇది అత్యధిక బడ్జెట్‌తో రూపొందించబడిన సినిమా. తమన్ అందించిన సంగీతం, విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రహణం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తాయని తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలో నటించారు. సినీ పరిశ్రమలో అత్యుత్తమ సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేయడంతో, 'డాకు మహారాజ్'కు ఉన్న హైప్ మరింత పెరిగింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రూపొందించిన ఈ సినిమా పక్కా మాస్ బొమ్మా అనేలా కామెంట్స్ వినిపిస్తున్నాయి. సంక్రాంతి విడుదల నేపథ్యంలో భారీ ఓపెనింగ్స్ అందుకుంటుందని నిర్మాతలు నమ్మకంతో ఉన్నారు.ఇక చిత్ర బృందం విడుదల తేదీ విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు అని మరోసారి క్లారిటీ ఇచ్చేసింది. జెట్ స్పీడ్ లోనే షూటింగ్ పనులు ముగిశాయి. ఇక షూటింగ్ చివరి నిమిషాల్లో బాలకృష్ణ, బాబీ ఉన్న స్టిల్‌ను విడుదల చేశారు. ఆ లుక్ లో బాలయ్య పవర్ఫుల్ గా కనిపిస్తున్నారు. 'డాకు మహారాజ్' పాత్రకు ఆయన పర్ఫెక్ట్ అని నెటిజన్లు కూడా కామెంట్ చేస్తున్నారు. పోస్టర్ తోనే మంచి వైబ్ క్రియేట్ చేస్తున్న బాలయ్య వెండితెరపై ఇంకా ఏ రేంజ్ లో ఆకట్టుకుంటాడో అని ఫ్యాన్స్ అంచనాలు పెంచేసుకుంటున్నారు.



సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్.. త్వరలోనే వివాహ బంధంలోకి అడుగు పెడుతున్న విషయం తెలిసిందే. తన లాంగ్ టైమ్ బాయ్ ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్ ను డిసెంబర్ లో పెళ్లి చేసుకోనున్నారు. కొద్ది రోజుల క్రితం తన ప్రియుడితో రిలేషన్ షిప్ ను కన్ఫామ్ చేసిన ఆమె.. తిరుమలలో మ్యారేజ్ మ్యాటర్ ను అఫీషియల్ గా రీసెంట్ గా అనౌన్స్ చేశారు. త్వరలో పెళ్లి జరగనుందని, అందుకే తిరుమల వచ్చానని తెలిపారు. గోవాలో వివాహ వేడుకలు జరుగుతాయని చెప్పారు.

# కీర్తి సురేష్.. లెహంగాలో బుట్టబొమ్మలా..

ఆ తర్వాత 15 ఏళ్ళుగా తాను ఆంటోనీతో ప్రేమలో ఉన్నట్టు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. వారిద్దరూ కలిసున్న ఓ ఫోటో షేర్ చేస్తూ.. 15 ఏళ్ళు.. ఇంకా కంటిన్యూ అవుతుందని రాసుకొచ్చారు. అని క్రేజీగా క్యాప్షన్ ఇచ్చారు. అయితే త్వరలో పెళ్లి కూతురిగా మారనున్న కీర్తి.. రీసెంట్ గా తన ఫ్రెండ్, ప్రముఖ స్టైలిస్ట్ శ్రావ్య వర్మ మ్యారేజ్ కు వెళ్లారు. డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ మేనకోడలు అయిన ఆమె.. కొద్ది రోజుల క్రితం బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ తో ఏడడుగులు నడిచారు. శ్రీకాంత్, శ్రావ్య పెళ్లిలో కీర్తి ఓ రేంజ్ లో సందడి చేశారు. అప్పుడు బ్యూటిఫుల్ లెహంగాలో కనిపించారు. ఆ ఫోటోస్ ను ఇప్పుడు కీర్తి సురేష్ షేర్ చేశారు. ఫుల్ వర్క్ తో రూపొందిన లెహంగాలో బుట్ట బొమ్మలా కనిపిస్తున్నారు. మల్లెపూలు.. డీసెంట్ నెక్ అండ్ ఇయర్ రింగ్స్ సెట్ పెట్టుకున్న అమ్మడు.. అదిరిపోయేలా ఉన్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ పిక్స్.. నెట్టింట తెగ ట్రెండ్ అవుతున్నాయి. ట్రెడిషనల్ వేర్ లో కీర్తి చాలా బాగున్నారని అంతా చెబుతున్నారు. సో బ్యూటిఫుల్ మేడమ్ అంటూ కొనియాడుతున్నారు. అడ్వాన్స్ గా హ్యాపీ మ్యారీడ్ లైఫ్ అంటూ విష్ చేస్తున్నారు. NYKE ట్యాగ్ ను ట్రెండ్ చేస్తున్నారు. మ్యారేజ్ పిక్స్ కోసం వెయిటింగ్ అని అంటున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే.. మలయాళం మూవీ గీతాంజలితో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన కీర్తి సురేష్.. నేను శైలజ సినిమా తో టాలీవుడ్ లోకి వచ్చారు. ఆ చిత్రంతో మంచి హిట్ అందుకున్న కీర్తి.. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. అనేక చిత్రాలతో అందరినీ మెప్పించారు. ఇప్పుడు బాలీవుడ్ లోకి కూడా ఎంట్రీ ఇస్తున్నారు



# చిరంజీవి కొత్త లుక్కు... యంగ్ స్టర్ లా మెగాస్టార్!

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఇప్పుడు మరింత యంగ్ లుక్ తో దర్శమిస్తున్నారు. తాజాగా ఆయన కొత్త లుక్ తో ఫొట్ షూట్ చేశారు. బ్లాక్ అండ్ బ్లాక్ అవుట్ ఫిట్ తో చిరంజీవి పాత రోజులను గుర్తుకు తెస్తున్నారు. కళ్లకు బ్లాక్ గ్లాసెస్ ధరించిన చిరు... హెయిర్ స్టయిల్ కూడా మార్చేశారు. మొత్తానికి రెగ్యులర్ చిరంజీవిలా కాకుండా, సరికొత్త మేకోవర్ ను ఆవిష్కరించారు. ఈ ఫొటోల్లో మెగాస్టార్ ఫుల్ జోష్ తో ఎనర్జిటిక్ గా ఉండడం చూడొచ్చు. ప్రస్తుతం చిరంజీవి యువ దర్శకుడు వశిష్ట దర్శకత్వంలో విశ్వంభర చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో నటించేందుకు చిరు ఓకే చెప్పినట్టు తెలుస్తోంది.




# పుష్ప 2 అమెరికా బాక్సాఫీస్.. ప్రీమియర్ షోలతో వైల్డ్ ఎటాక్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా మూవీ పుష్ప 2: ది రూల్ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్‌ను సొంతం చేసుకుంది. డిసెంబర్ 5న గ్రాండ్ రిలీజ్ కాబోతున్న ఈ చిత్రానికి నార్త్ అమెరికా ప్రీమియర్ షోలకు సాలీడ్ రెస్పాన్స్ లభిస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం, ఈ సినిమాకు ఇప్పటివరకు %వి%2.5 మిలియన్ ప్రీ సేల్స్ కలెక్షన్స్ వచ్చాయి. దీంతో టాలీవుడ్ లో సాధించిన బెస్ట్ రికార్డ్‌గా నిలిచింది. ఇక వివరాల్లోకి వెళితే, పుష్ప 2 యూఎస్‌లో 1048 థియేటర్లలో 4003 ప్రీమియర్ షోలు ప్లాన్ చేశారు. ఇప్పటివరకు మొత్తం 81,340 టికెట్లు అమ్ముడైనట్లు ట్రేడ్ విశ్లేషకులు తెలిపారు. ఈ రికార్డ్‌తో, పుష్ప 2 నార్త్ అమెరికా మార్కెట్లో ఒక పెద్ద రికార్డ్ ను అందుకుంది.2.1 మిలియన్ డాలర్ల కలెక్షన్‌తో తెలుగు వెర్షన్ టాప్‌లో నిలిచింది. అయితే ఇతర భాషల్లో కూడా మంచి ఆదరణ కనిపిస్తోంది. హిందీ వెర్షన్‌కు150ఖ, తమిళంలో %వి25ఖ%, మలయాళం అలాగే కన్నడ భాషల్లో 15 కలెక్షన్స్ రాబట్టాయి. ఈ సంఖ్యలు పుష్ప 2 పాన్ ఇండియా స్థాయిని హైలెట్ చేస్తోంది. కానీ, తెలుగులో ఉన్న భారీ హైప్‌కు తగ్గట్టుగా ప్రీ సేల్స్ కొద్దిగా తక్కువగా ఉన్నాయని అనిపిస్తోంది. ప్రీమియర్ షోల తర్వాత టాక్ వల్ల కలెక్షన్స్ మరింత పెరుగుతాయనే ఆశాభావం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే, పుష్ప 2 ఈ రికార్డులతో ఆర్‌ఆర్‌ఆర్, కేజీఎఫ్ 2, బాహుబలి వంటి భారీ సినిమాల రికార్డులను అందుకోవడానికి సిద్ధమవుతోంది.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613